# థెస్సలోనికయులకు వ్రాసిన రెండవ పత్రిక

1 తండ్రియైన దేవునికి యేసు క్రీస్తు ప్రభువుకు చెందిన
థెస్సలొనీకయ సంఘానికి,
పౌలు, సీల,* తిమోతి అనే మేము వ్రాయునది:
2 తండ్రియైన దేవుని నుండి ప్రభువైన యేసు క్రీస్తు నుండి కృపా
సమాధానాలు మీకు కలుగును గాక.

## కృతజ్ఞతలు ప్రార్థన

3 సహోదరీ సహోదరులారా, మేము మీ గురించి ఎల్లప్పుడూ
దేవునికి కృతజ్ఞతలు చెల్లించ వలసిందే ఎందుకంటే, మీ విశ్వాసం
అంతకంతకు పెరుగుతుంది, మీ అందరికి ఒకరిపట్ల ఒకరికి ఉన్న ప్రేమ
మరింత అధికమవుతూ ఉంది.
4 కాబట్టి మీరు పొందుతున్న హింసలలో శ్రమలలో మీరు
చూపుతున్న ఓర్పు విశ్వాసం గురించి దేవుని సంఘాల్లో మేము
గొప్పగా చెప్తున్నాము.
5 దీన్ని బట్టి దేవుడు ఇచ్చిన తీర్పు న్యాయమైనదని
తెలియజేయడానికి రుజువుగా, మీరు అనుభవించిన శ్రమల వలన
మీరు దేవుని రాజ్యానికి అర్హులు అవుతారు.
6 దేవుడు న్యాయవంతుడు కాబట్టి మిమ్మల్ని హింసించినవారిని
తగిన విధంగా శిక్షిస్తారు,
7 పరలోకం నుండి ప్రభువైన యేసు తన శక్తివంతమైన దూతలతో
కలిసి అగ్నిజ్వాలల్లో ప్రత్యక్షమైనప్పుడు ఇప్పుడు శ్రమలను
అనుభవిస్తున్న మీకు అదే విధంగా మాకు విశ్రాంతిని ఇస్తారు.

---

* **1:1** గ్రీకులో సిల్వాను సీల యొక్క మరో రూపం

8 దేవుని ఎరుగని వారిని, మన ప్రభువైన యేసు యొక్క సువార్తకు
లోబడని వారిని ఆయన శిక్షిస్తారు.
9 వారు అనుభవించే శిక్ష నిత్య నాశనంగా ఉంటుంది,
అలాంటివారు ప్రభువు సన్నిధి నుండి ఆయన మహాప్రభావం నుండి
వెళ్లగొట్టబడతారు,
10 ఆయన వచ్చే దినాన తన పరిశుద్ధ ప్రజలమధ్య మహిమను
కనుపరచుకున్నప్పుడు ఆయనను నమ్మినవారందరు ఆశ్చర్యంగా
ఆయనను చూస్తారు. మేము మీకు చెప్పిన సాక్ష్యాన్ని మీరు
విశ్వసించారు కాబట్టి మీరు కూడా వారిలో ఉంటారు.

11 దీన్ని హృదయంలో ఉంచుకుని, మన దేవుడు మీకిచ్చిన
పిలుపుకు మిమ్మల్ని ఆయన యోగ్యులుగా చేయాలని, ఆయన
తన శక్తిచేత మీ ప్రతి ఉత్తమమైన కోరికను ఫలింపచేయాలని, మీ
ప్రతి పని విశ్వాసం వలన జరగాలని మేము మీ కోసం ఎల్లప్పుడూ
ప్రార్థిస్తున్నాము.
12 తద్వారా మన దేవుని యొక్క ప్రభువైన యేసు క్రీస్తు యొక్క
కృపను బట్టి మన ప్రభువైన యేసు నామం మీలో, మీరు ఆయనలో
మహిమపరచబడాలని మేము ప్రార్థిస్తున్నాము.

# 2

## దుర్మార్గుడైన వ్యక్తి

1 సహోదరీ సహోదరులారా, మన ప్రభువైన యేసు క్రీస్తు రాకడ
గురించి మనం ఆయనను కలుసుకొనుట గురించి మేము మిమ్మల్ని
అడిగేది ఏంటంటే,
2 ప్రభువు రాబోయే దినం వచ్చేసిందని ప్రకటించే ప్రవచనాల ద్వారా
గాని నోటిమాటల ద్వారా లేదా ఏదైన ఉత్తరం ద్వారా గాని మీకు తెలిస్తే
తొందరపడి కలవరంతో భయపడకండి.

3 మిమ్మల్ని ఎవరైనా ఏ రీతిగానైనా మోసపరచనివ్వకండి.
ఎందుకంటే తిరుగుబాటు వచ్చేవరకు, నాశనానికి కర్తయైన
దుర్మార్గుడు బయటపడే వరకు ఆ దినం రాదు.
4 వాడు దేవునిగా పిలువబడే ప్రతిదాన్ని, పూజించబడే వాటన్నిటిని
వ్యతిరేకించి, తనను తాను వాటన్నిటికంటే పైగా హెచ్చించుకొంటూ,
తనంతట తానే దేవాలయంలో కూర్చుని, తానే దేవుడనని
ప్రకటించుకుంటాడు.
5 నేను మీతో ఉన్నప్పుడు మీకు తెలియజేసిన ఈ సంగతులు మీకు
జ్ఞాపకం లేవా?
6 అయితే అతడు సరియైన సమయంలో బయలుపరచబడడానికి
ఏది అతన్ని అడ్డగిస్తూ ఉందో ఇప్పుడు మీకు తెలుసు.
7 ఆ దుర్మార్గుని యొక్క రహస్యశక్తి ఇప్పటికే పని చేస్తూ ఉంది;
అయితే దానిని అడ్డగిస్తున్నవాడు మార్గంలో నుండి వాన్ని తీసివేసే
వరకు వాడు అడ్డగిస్తూ ఉంటాడు.
8 ఆ దుర్మార్గుడు బయలుపరచబడినప్పుడు, ప్రభువైన యేసు తన
నోటి ఊపిరితో అతన్ని పడగొట్టి, తన రాకడ ప్రకాశంతో అతన్ని నాశనం
చేస్తారు.
9 సాతాను చేసే పనులకు అనుకూలంగా దుర్మార్గుని రాకడ
ఉంటుంది. అతడు తన అబద్ధాన్ని నిరూపించుకోవడానికి, తన శక్తిని
చూపించుకోడానికి సూచకక్రియలు, అద్భుతాలు, మహాత్కార్యాలను
చేస్తాడు,
10 అతడు నశించువారిని అన్ని విధాలుగా దుష్టత్వంతో
మోసగిస్తాడు, వారు రక్షణ పొందడానికి గాని సత్యాన్ని ప్రేమించడానికి
నిరాకరించారు కాబట్టి వారు నశిస్తారు.
11 ఈ కారణంగా, వారు అబద్ధాన్ని నమ్మేలా దేవుడు వారి మీదకు
బలమైన భ్రమను పంపాడు.
12 అప్పుడు సత్యాన్ని నమ్మకుండా దుర్మార్గంలో ఆనందించేవారు
శిక్షకు పాత్రులుగా ఎంచబడతారు.

### స్థిరంగా నిలబడు

13 ప్రభువు ప్రేమించిన సహోదరీ సహోదరులారా, మేము మీ కోసం
ఎల్లప్పుడూ దేవునికి కృతజ్ఞతలు చెల్లించ వలసిందే ఎందుకంటే,
మీరు రక్షణ పొందడానికి సత్యాన్ని నమ్మడం ద్వారా దేవుడు మిమ్మల్ని
ఆత్మ చేత పరిశుద్ధపరచడానికి ప్రారంభం నుండి ఏర్పరచుకున్నారు.
14 మీరు మన ప్రభువైన యేసు క్రీస్తు మహిమలో పాలుపొందేలా
మా సువార్త ద్వారా దేవుడు మిమ్మల్ని పిలిచాడు.
15 కాబట్టి సహోదరీ సహోదరులారా, మీరు మా నోటి మాటలతో
లేదా ఉత్తరాల ద్వారా మేము మీకు చేయించిన బోధను గట్టిగా
పట్టుకుని దానిలో స్థిరంగా ఉండండి.
16 మన ప్రభువైన యేసు క్రీస్తును మన తండ్రియైన దేవుడు
మనల్ని ప్రేమించి తన కృప చేత మనకు నిత్య ప్రోత్సాహాన్ని స్థిరమైన
నిరీక్షణను ఇచ్చి,
17 మన హృదయాలను ధైర్యపరచి, ప్రతి మంచి పనిలో మంచి
మాటల్లో మిమ్మల్ని బలపరచును గాక.

# 3

### ప్రార్థన కోసం మనవి

1 సహోదరీ సహోదరులారా, మిగిలిన విషయాలు ఏంటంటే,
ప్రభువు వాక్యం మీలో వ్యాపించిన ప్రకారమే మరింతగా వేగంగా
వ్యాపించి ఘనత పొందేలా మాకోసం ప్రార్థించండి.
2 విశ్వాసం అందరికి లేదు కాబట్టి మూర్ఖులైన దుష్టప్రజల నుండి
మేము విడిపించబడునట్లు మీరు ప్రార్థించండి.
3 అయితే ప్రభువు నమ్మదగినవాడు కాబట్టి ఆయన మిమ్మల్ని
బలపరచి దుష్టుని నుండి కాపాడును.
4 మేము మీకు ఆజ్ఞాపించిన వాటిని మీరు చేస్తున్నారని, వాటిని
చేయడం కొనసాగిస్తారని ప్రభువులో మేము నమ్ముతున్నాము.

5 ప్రభువు మీ హృదయాలను దేవుడు మీ పట్ల చూపిన ప్రేమ, క్రీస్తు
చూపిన సహనం వైపు నడిపించును గాక.

## సోమరులకు హెచ్చరిక

6 సహోదరీ సహోదరులారా, మీరు మా నుండి పొందిన బోధల
ప్రకారం జీవించక, తమ పనులను చూసుకోక సోమరులుగా
బ్రతుకుతున్న ప్రతి విశ్వాసికి మీరు దూరంగా ఉండాలని మన
ప్రభువైన యేసు క్రీస్తు నామంలో మేము మిమ్మల్ని ఆజ్ఞాపిస్తున్నాము.
7 మా మాదిరిని మీరు ఎలా అనుసరించాలో అది మీకు తెలుసు.
అంటే మేము మీ మధ్యన ఉన్నప్పుడు వట్టి చేతులతో సోమరులుగా
కూర్చోలేదు,
8 మేము ఎవరి దగ్గర ఉచితంగా ఆహారాన్ని తినలేదు. దానికి
బదులు, మేము మీలో ఎవరికీ భారంగా ఉండకూడదని రాత్రింబవళ్ళు
కష్టపడి శ్రమించి పని చేశాము.
9 అలాంటి సహాయాన్ని పొందే హక్కు లేదని అలా చేయలేదు కాని,
మీరు మాలా ప్రవర్తించేలా మీకు ఒక ఆదర్శంగా ఉండాలని మేము
అలా చేశాము.
10 మేము మీతో ఉన్నప్పుడు, “పని చేయనివాడు ఆహారం
తినడానికి పాత్రుడు కాడు” అనే నియమాన్ని కూడా మీకు ఇచ్చాము.
11 మీలో కొందరు సోమరులుగా ఏ పని చేసుకోకుండా ఇతరుల
విషయాల్లో జోక్యం చేసుకుంటూ ఉన్నారని మేము విన్నాము.
12 అలాంటివారు స్థిరపడి, వారు తినే ఆహారాన్ని వారే
సంపాదించుకోవాలని మన ప్రభువైన యేసు క్రీస్తు నామంలో మేము
వారిని హెచ్చరిస్తున్నాము, వేడుకుంటున్నాము.
13 సహోదరీ సహోదరులారా, మంచి చేయడంలో మీరు ఎన్నడూ
అలసి పోవద్దు.
14 ఈ ఉత్తరంలో మేము వ్రాసిన సూచనలను పాటించని వారిని
గమనించి వారు సిగ్గుపడేలా మీరు వారితో కలవకండి.
15 అయితే వారిని శత్రువులుగా చూడవద్దు కాని, మీ తోటి
విశ్వాసులుగా వారిని హెచ్చరించండి.

### ముగింపు వందనాలు

16 సమాధానానికి కర్తయైన దేవుడు అన్ని సమయాల్లో అన్ని
విధాలుగా మీకు సమాధానం కలుగజేయును. ప్రభువు మీ అందరికి
తోడై ఉండును గాక!

17 పౌలు అనే నేను నా స్వహస్తంతో ఈ శుభములు వ్రాస్తున్నాను,
నేను వ్రాసిన ఉత్తరాలన్నింటిలో నేను వ్రాశాను అనడానికి ప్రత్యేకమైన
గుర్తు ఇదే.

18 మన ప్రభువైన యేసు క్రీస్తు కృప మీ అందరితో ఉండును గాక.

# Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం
## The Holy Bible in the Telugu language of India, Open Telugu Contemporary Version: Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం

copyright © 1976, 1990, 2022, 2024 Biblica, Inc.

Language: తెలుగు (Telugu)

Contributor: Biblica, Inc.

Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.

**Creative Commons License**

This work is made available under the Creative Commons Attribution-ShareAlike 4.0 International License (CC BY-SA). To view a copy of this license, visithttps://creativecommons.org/licenses/by-sa/4.0 or send a letter to Creative Commons, PO Box 1866, Mountain View, CA 94042, USA.
You have permission to copy and distribute this Work, as long as you do not change it and you keep the title as it is. Changing or translating this Work will create a derivative work. When you publish this derivative work, you must list what changes you have made where people can see them, such as on a website. You must also show where the original Work is from: "The original Work by its copyright holders is available for free at www.biblica.com and open.bible."
Notice of copyright must appear on the title or copyright page of the work as follows:
Biblica® ఉచిత తెలుగు సమకాలీన అనువాదం™
ప్రచురణ హక్కులు © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
Biblica® Open Telugu Contemporary Version™
Copyright © 1976, 1990, 2022, 2024 by Biblica, Inc.
"Biblica" అనేది యునైటెడ్ స్టేట్ పేటెంట్, ట్రేడ్‌మార్క్ ఆఫీసులో Biblica, Inc. ద్వారా నమోదు చేయబడిన ట్రేడ్‌మార్క్.
"Biblica" is a trademark registered in the United States Patent and Trademark Office by Biblica, Inc. Used with permission.
You must also make your derivative work available under the same license (CC BY-SA).
If you would like to notify Biblica, Inc. regarding your translation of this work, please contact us at https://open.bible/#feedback.

This translation is made available to you under the terms of the Creative Commons Attribution Share-Alike license 4.0.
You have permission to share and redistribute this Bible translation in any format and to make reasonable revisions and adaptations of this translation, provided that:

You include the above copyright and source information.

If you make any changes to the text, you must indicate that you did so in a way that makes it clear that the original licensor is not necessarily endorsing your changes.

If you redistribute this text, you must distribute your contributions under the same license as the original.

Pictures included with Scriptures and other documents on this site are licensed just for use with those Scriptures and documents. For other uses, please contact the respective copyright owners.
Note that in addition to the rules above, revising and adapting God's Word involves a great responsibility to be true to God's Word. See Revelation 22:18-19.

2025-05-21

---

PDF generated using Haiola and XeLaTeX on 21 May 2025 from source files dated 21 May 2025
aafdee53-20e2-535c-b239-4ef9982e6ec6